# సంక్షేమమే లక్ష్యంగా 'ప్రజాపాలన'

## అభయహస్తం దరఖాస్తుల స్వీకరణలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



పరిగి మండలం మాదారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



తాండూరు: మున్సిపల్‌లోని 9వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 29 : ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నదని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పరిగి మండలం మాదారం గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అభయహస్తం గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ధరణికి బదులుగా భూమాత పేరుతో భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గానికి రైల్వేలైన్, నాలుగు లైన్ల రహదారితోపాటు ప్రాణహిత-చేవెళ్ల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 57 టీమ్‌లను ఏర్పాటు చేశామని, 87 గ్రామపంచాయతీలు, 13 మున్సిపల్ వార్డులలో 100 గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమంలో కుటుంబం నుంచి ఒకరు వచ్చి దరఖాస్తు చేస్తే సరిపోతుందని అన్నారు. సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరణం అరవిందరావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ రాములు, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి బాబు మోజెస్, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**దోమ:** మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సదస్సుకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరై ప్రజలకు అభయహస్తం ఆరు గ్యారెంటీల రసీదులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరించి అన్ని పథకాలు లబ్ధి చేకూరే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరేందర్ రెడ్డి, ఎంపీపీ అనసూయ, డీసీసీ అధ్యక్షుడు హన్మంతుముదిరాజ్, ఏవో ప్రభాకర్ రావు, వార్డు సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

**తాండూరు/యాలాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శుక్రవా రం నియోజక వర్గంలో సందడిగా సాగింది. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు పట్టణంలోని 9వ వార్డు సాయిపూర్‌లో, యాలాల మండలం దేవనూరులో ఏర్పాటు చేసి న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల నుంచి దరఖా స్తులు తీసుకున్నారు. ప్రజలు దరఖాస్తు ఫారాలను రూ.40 నుంచి రూ.60 కి దళారుల వద్ద కొనుగోలు చేశారు. ప్రజాపాలన ప్రారంభంలోనే దళారులు రెచ్చిపోవడంపై విమర్శ లు వచ్చాయి. దరఖాస్తు స్వీకరణలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామన్నారు. గిట్టని వారు ఎన్ని కుట్రలు పన్నినా ఒరిగేదేమీలేదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత తమదేన న్నారు. ప్రభుత్వ పథకాల్లో అందరికి సమన్యాయం ఉంటుందని తెలిపారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా పాలన కొనసాగిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే ఎంతటివారైన చర్యలు తప్పవన్నారు. ప్రజలు దళారులను నమ్మరాదన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న పాలకులు, ప్రభుత్వ సిబ్బందిని సంప్రదించాలని సూచిం చారు. ప్రజలను మోసం చేసే వ్యక్తులను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, కౌన్సిలర్ నీరజ, రత్న మాల, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట:** సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని జానకంపల్లి, సూర్యానాయక్‌తండా, గట్టెనాయక్ తండా, మేడిచెట్టుతండా, బాపల్లితండా, హంసాన్‌పల్లి, ఎక్కచెరువుతండా, కూబ్యానాయక్‌తండాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సూర్యానాయక్‌తండా గ్రామసభను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సందర్శించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. బొంరాస్‌పేట, దుద్యాల తహసీల్దార్లు వెంకటేశ్, దానయ్య, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, డీటీ రవి, ఆర్ఐ రవిచారి, ఇతర శాఖల అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. రేగడిమైలారంలో సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ జగదీశ్, వార్డు సభ్యులు ప్రజలకు దరఖాస్తులు పంపిణీ చేశారు. ఇతర గ్రామాల్లో కూడా అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్నారు.

**ధారూరు:** అర్హులైన వారు గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జడ్పీ సీఈవో జానకీరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీడీవో చెన్నారెడ్డి, తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీవో షఫిఉల్లా, గ్రామ సర్పంచ్ చంద్రకళ, మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, ఎఈవో సంజువ్ రాథోడ్ పాల్గొన్నారు.

**మర్పల్లి:** మండలంలోని కొంషట్‌పల్లి, మొగిలిగుండ్ల, తిమ్మాపూర్, రావులపల్లి గ్రామాల్లో రెండోరోజు శుక్రవారం ప్రజాపాలన దరఖాస్తులనుఅధికారులు స్వీకరించారు. తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో రాజమల్లయ్య రెండు టీంలుగా ఆయా గ్రామాల్లో అభయహస్తం ఆరు గ్యారెంటీల పథకాలను వివరిస్తూ దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే పంచాయతీ కార్యదర్శికి ఇవ్వాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



ధారూరు: గట్టేపల్లి గ్రామంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జడ్పీ సీఈవో జానకిరెడ్డి



బొంరాస్‌పేట: సూర్యానాయక్‌తండాలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

## పకడ్బందీగా అభయహస్తం: మున్సిపల్ చైర్‌పర్సన్

వికారాబాద్, డిసెంబర్ 29 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 4,5,6వ వార్డుల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఈ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలో అభయహస్తం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్ కుమార్, కమిషనర్ జాకీర్ అహ్మద్, స్థానిక నాయకులు, కౌన్సిలర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా మహా పడిపూజ



అయ్యప్ప పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, డిసెంబర్ 29: మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. పడి పూజలో భాగంగా ఓం శ్రీ స్వామియే... శరణమయ్యప్ప అంటూ అయ్యప్పస్వామి దీపారాధన, నవవిధాభిషేకాలు, పుష్పార్చ నలు, పేటతుళ్లై నృత్యాలు, భజనలు చేశారు. మహా పడిపూజకు అయ్యప్ప దీక్ష ధరించిన స్వాములు, నియోజకవర్గంలోని నేతలు, అధికారులు, అభిమానులు, పార్టీలకు, కులమతాల అతీతంగా భక్తులు వేల సంఖ్యలో వచ్చి అయ్యప్ప స్వామి కృపకు పాత్రులయ్యారు.



కులకచర్ల, డిసెంబర్ 29: ఇటీవల డాక్టరేట్ అందుకున్న కులకచర్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్‌ను మండల సర్పంచులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తమ మండలానికి చెందిన సర్పంచ్ శంకర్‌నాయక్‌కు డాక్టరేట్ రావడం అభినందనీయమని పలువురు సర్పంచులు ఆనందం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు సన్మార్గాన్ని ఆచరించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సేవక్‌కుమార్

కులకచర్ల, డిసెంబర్ 29 : విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని మోటివేషన్ స్పీకర్ సేవక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఆపదలు వచ్చాయని కుంగిపోకుండా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల మాటలను గౌరవించడం, గురువుల మాటలను ఆచరించడం, సన్మార్గానికి నిదర్శనమని తెలిపారు. చెడుమార్గాన్ని వీడి మంచి మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల కేజీబీవీ ఎస్‌వో దేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట, డిసెంబర్ 29 : ఇటీవల పీహెచ్‌డీ పట్టా అందుకున్న ఒగ్గు కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్తాద్ ఒగ్గు రవిని మండలంలోని నాందార్‌పూర్ గ్రామానికి చెందిన మల్లికార్జున ఒగ్గు కళాకారుల సంఘం అధ్యక్షుడు బీరప్ప, కళాకారులు శివ, మల్లేశ్, శివ శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. పీహెచ్‌డీ పట్టా అందుకున్నందుకు రవిని వారు అభినందించారు.